## వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



**రాజముద్ర న్యూస్, తిర్యాణి:** వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ మడావి పార్వతి అన్నారు. మండలంలోని ఎదులపాడ్ గ్రామ పంచాయతీలోని ఎదులపాడ్ గ్రామంలో ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నివారణ కోసం మంచి నీటి బావులలు, బోర్ వద్ద, డ్రైనేజ్ ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అదేవిధంగా పాత డ్రమ్ములు, పాత టైర్లు, కొబ్బరి బోండాలలో నీరు నిల్వ ఉన్న వాటిని పడేస్తూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొట్టె అశోక్, వార్డ్ సభ్యులు మడావి వర్ణవతి, మల్టీ పర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత కాలనీల్లో ముమ్మర పారిశుధ్య పనులు



**రాజముద్ర న్యూస్, గుడిహత్నూర్:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జలమయమైన గుడిహత్నూర్ గ్రామంలోని కాలనీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఆడే శీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచే పనులు చేపట్టారు. భారీ వర్షాల అనంతరం మహంకాళి గల్లీలో ముంపు బాధితులను పరామర్శించిన సర్పంచ్, శుక్రవారం వాతావరణం అనుకూలించడంతో వెంటనే పారిశుధ్య పనులను ప్రారంభించారు. లింగాపూర్ రోడ్, సోనార్ గల్లీల్లో పూడికతో నిండిపోయిన నాళాలను గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి స్వయంగా పర్యవేక్షిస్తూ పూడికతీత పనులు నిర్వహించారు. ఇటీవల సర్పంచ్ చొరవతో రవీంద్ర నగర్, ఎక్రోస్డ్ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన కొత్త కచ్చా నాళాలతో ఈసారి వరద నీటి ప్రవాహం సాఫీగా జరిగి, ముంపు తీవ్రత గణనీయంగా తగ్గిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఎంఐఎం మండల అధ్యక్షుడు అర్షద్ ఖురేషి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షా నికి కూలిన ఇల్లు



**రాజముద్ర న్యూస్, జైనూర్:** మండలంలోని లక్ష్మణ్ పటేల్ గూడ గ్రామంలో కురిసిన భారీ వర్షాలతో ఆడా మోహన్కు చెందిన ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యులెవరూ గాయపడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా ఇంట్లో ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, గృహోపకరణాలు వర్షపు నీటిలో తడిసి పూర్తిగా పాడయ్యాయి. నివాసం కోల్పోయిన ఆ కుటుంబం ప్రస్తుతం ఉండటానికి ఆశ్రయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తాము ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇల్లు ఒక్కసారిగా కూలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని బాధితుడు ఆడా మోహన్ ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు సందర్శించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన సాయం అందించాలని విజ్ఞప్తి చేశాడు.

## పెండింగ్ సీఎంఆర్ సరఫరా వెంటనే పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** జిల్లాలో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరాను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని ఎస్ఆర్ఎం రైస్ మిల్లు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించడం ప్రతి రైస్ మిల్లర్ బాధ్యత అని స్పష్టం చేశారు. పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. సీఎంఆర్ సరఫరా విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో , జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 90 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కలెక్టర్ నీ శాల్వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారీ వర్షా లకు పెంకుటిల్లు కూలి నిరాశ్రయమైన కుటుంబం





**రాజముద్ర న్యూస్, కెరమెరి:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలో భారీ వర్షాల ధాటికి ఓ నిరుపేద కుటుంబానికి చెందిన పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇంటి మట్టి గోడలు బలహీనపడి ఒక్కసారిగా పైకప్పుతో సహా నేలమట్టమయ్యాయి. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు తీవ్ర అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తి కావడంతో తన నివాసాన్ని కోల్పోయి తలదాచుకునే చోటు లేక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం కూలిపోయిన ఇంటి శిథిలాల వద్దే కుటుంబ సభ్యులతో కలిసి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఘటనపై స్థానికులు స్పందిస్తూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే ఆదుకోవాలని కోరారు. వెంటనే ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇందిరమ్మ గృహ పథకం కింద శాశ్వత నివాసం మంజూరు చేసి ఆ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు

### ఎమ్మెల్సీ దండే విఠల్



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మర్తిడి గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మర్తిడి గ్రామ ఉప సర్పంచ్ అప్పల శ్రీనివాస్, వార్డు సభ్యులు, దుర్గం బిబిన్, రాంటెంకి దిలీప్, దుర్గం డోనాజీ, తాళ్లపల్లి ప్రకాష్, చిప్పకుర్తి మహేష్, దుర్గం శివకృష్ణ, సుందిళ్ల లవేష్తో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మర్తిడి గ్రామ సర్పంచ్ మల్లేష్, ఉత్సరంగపల్లి సర్పంచ్ ఎనుక శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరామ్, రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు బుస శంకర్, ఉమ్మెర సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



**రాజముద్ర న్యూస్, జైనూర్:** ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామని, ఉమ్మడి జైనూర్, సిర్పూర్, లింగాపూర్ మండలాల ఆదివాసి సమాజం ఐక్యంగా ముందుకు రావాలని ఆదివాసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జైనూర్ మండల కేంద్రంలో గొండ్వానా పంచాయతీ రాయిసేంటర్ల ఆధ్వర్యంలో తుడుందెబ్బ, ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసి విద్యార్థి సంఘం తదితర సంఘాల నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ఐక్య రాజ్యసమితి గుర్తించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, భాషలు, సాంప్రదాయాలు, భూమి, అడవి, జలాలపై హక్కులు, రాజ్యాంగబద్ధ రక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలపై చైతన్యం పెంపొందించేందుకు ఈ దినోత్సవం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆదివాసీల హక్కులు, మనుగడ, సంస్కృతి పరిరక్షణ కోసం అన్ని ఆదివాసి సంఘాలు, మేధావులు, జాతి పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పటేళ్లు, దేవరీలు, యువత, విద్యార్థులు, మహిళలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 2న అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి జైనూర్, సిర్పూర్, లింగాపూర్ మండలాల తొమ్మిది తెగల ఆదివాసి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు, మహిళలు, ఆదివాసిలు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించే అంశంపై చర్చించడంతో పాటు నిర్వహణ కమిటీ ఎన్నిక చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గొండ్వానా పంచాయతీ రాయిసేంటర్ మహాగావ్ సార్ మేడి ఆత్రం ఆనంద్ రావు, జంగాం మాజీ సర్పంచ్ కుమ్ర శ్యామ్ రావు, జైనూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి మనోహర్, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి, సెడ్మాకి భగవంత్ రావు, అర్క యుగేందర్ తదితర ఆదివాసి సంఘాల నాయకులు, గ్రామ పటేళ్లు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, హక్కులు, అభివృద్ధిపై అవగాహన కల్పించే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యనిర్వహణ కమిటీ ప్రతినిధులతో కలిసి "ఛలో మంచిర్యాల" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉపాధి, గృహ వసతి, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న ఛలో మంచిర్యాల ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసీ కళలు, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యనిర్వహణ కమిటీ ప్రతినిధులు తట్ర అర్జున్, నైతం లక్ష్మణ్, సోయం జంగు, కుడిమేత తిరుపతి, గంజి రాజన్న, ఆడ జంగు, పెంద్రం హనుమంతు, కొడప అనిల్, కుర్సెంగ వెంకటేష్, పల్లె పృథ్వీరాజ్, మడావి వెంకటేష్, పెంద్రం తిరుపతి, గావుడె శ్రావణ్, మేసినేని అరుణ్, గెడం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

